

- ఉగ్రమూలాలపై వెలుగుచూస్తున్న కొత్త అంశాలు
- పేలుళ్లకు సిద్ధమవుతున్న సమయంలోనే సిరాజ్ అరెస్టు
- ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న పోలీసులు
- కలవరంలో జిల్లా ప్రజలు

విజయనగరంలోనే పేలుళ్లకు స్కెచ్





ఉగ్రవాద సానుభూతిపరులు విజయనగరంలోనే భారీ పేలుళ్లకు స్కెచ్ వేసినట్లు తాజాగా తెలిసింది. ఈ విషయాన్ని పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఇది తెలిసి జిల్లా ప్రజలు కలవరపడుతున్నారు. విజయనగరంలో ఉగ్రమూలాలు వెలుగుచూసిన నాటి నుంచి జిల్లా వాసులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడూ కనీవినీ ఎరుగని ఘటన చోటుచేసుకోవడం అందరినీ విస్తుపరిచింది. జిల్లాలోనే కాదు ఉత్తరాంధ్రలోనూ ఉగ్రనీడల అంశం ప్రధాన చర్చనీయాంశమైంది. మరోవైపు ఉగ్ర నీడలపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) రంగంలోకి దిగి లోతుగా దర్యాప్తు చేస్తోంది. విచారణలో కళ్లు బైర్లు కమ్మే నిజాలు వెలుగుచూస్తున్నట్లు సమాచారం.



నిందితుడు
సిరాజ్ ఉర్ రెహ్మాన్

విజయనగరం, మే 21 (ఆంధ్రజ్యోతి)

విజయనగరం నడిబొడ్డున పేలుళ్లకు సిద్ధమవుతున్న తరుణంలోనే ఉగ్ర సానుభూతిపరుడు సిరాజ్ ఉర్ రెహ్మాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తాజాగా తెలిసింది. పేలుడు పదార్థాలు, వాటికి అవసరమైన పీవీసీ పైపుముక్కలు, ఇతర సామగ్రిని శనివారం (ఈనెల 17న) నాడే కొనుగోలు చేసి ఐఈడీ (ఇంప్రవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్) తయారీకి సిద్ధమవుతున్న తరుణంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. ఇదే విషయాన్ని పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పొందుపరిచారు. ఉగ్రవాద సానుభూతిపరులు కొద్దిరోజులుగా పేలుడు పదార్థాలకు సంబంధించిన సామగ్రి సేకరణ, ఆన్‌లైన్‌లో వాటి కొనుగోలు వంటి పనుల్లో నిమగ్నమయ్యారు. విజయనగరంలోని విజ్జీ స్టేడియానికి వెళ్లే రోడ్డులో రాజానగర్ వద్ద పేలుడు పదార్థాలు, ఇతర సామగ్రి ఉన్న బ్యాగుతో మోటార్ సైకిల్‌పై అనుమానాస్పద స్థితిలో తిరుగుతుండగా పోలీసులు వీరిని అదుపులోకి తీసుకున్నారు. రహస్య ప్రాంతాలకు తీసుకెళ్లి విచారించారు. జనసమ్మర్థం అధికంగా ఉండే ప్రాంతాల్లో ఐఈడీని పేల్చేందుకు నిర్ణయం తీసుకున్నట్టు విచారణలో నిందితుడు వెల్లడించినట్లు తెలిసింది. ఏప్రిల్ 20, 26, 30 తేదీల్లో ఉర్దూ పాఠశాల అడ్రస్‌తో ఆన్‌లైన్‌లో పేలుడు పదార్థాలు **(మిగతా 8వ పేజీలో..)**



స్పీడు పెంచిన ఎన్ఐఏ

- **నిందితులను కస్టడీకి ఇస్తే పూర్తిస్థాయిలో విచారించే యోచన**
- **ఎఫ్ఐఆర్‌లో అనేక అంశాలను పేర్కొన్న పోలీసులు**

విజయనగరం/క్రైం/రూరల్/రింగురోడ్డు, మే 21 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లాలో ఉగ్రవాద సానుభూతిపరుల కదలికలపై ఎన్ఐఏ, పోలీస్ అధికారులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఎఫ్ఐఆర్‌లో అనేక సంచలన అంశాలను పేర్కొన్నారు. అందులో ఉన్న సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 16న కౌంటర్ ఇంటిలిజెన్స్ అధికారుల సమాచారంతో విజయనగరం పోలీసులు విజ్జీస్టేడియం సమీపంలో సిరాజ్ ఉర్ రెహ్మాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఓ సంచిలో పేలుడుకు వినియోగించే వస్తువులు, ల్యాప్‌టాప్, ఇతరత్రా సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో నిందితు డు కీలక విషయాలను వెల్లడించాడు. తాను బీటెక్ వరకు చదువుకున్నానని, కొత్తవలసలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేశానని, అనంతరం హైదరా బాద్ వెళ్లి పలు ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రయత్నాలు చేసినట్లు దర్యాప్తులో వెల్లడించాడు. హైదరాబాద్‌లోని ముషీరాబాద్ బోయగూడకు చెందిన సయ్య ద్ సమీర్ పరిచయం అయ్యాక వరంగల్‌కు చెందిన పరహాన్ మొహిద్దిన్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఖాదర్‌తో కూడా పరిచయం ఏర్పడిందని... ఖిలాఫత్, జీహాది తదితర విషయాలపై చర్చించుకున్నట్లు పోలీసులకు తెలిపాడు. రాకెట్ లాంచర్ తయారుచేయడం, దాన్ని వినియోగించడంపై ఆన్‌లైన్‌లో అధ్యయనం చేసిన సిరాజ్ వాటి తయారీ కోసం విజయనగరంలోని మూడు షాపుల్లో ప్లాస్టిక్ పైపులు, బ్లేడ్‌లు, అందుకు కావాల్సిన ఇతర సామగ్రిని కొనుగోలు చేసినట్లు తెలిసింది.

- కొంతమంది మతోన్మాదుల ప్రసంగాలకు ఆకర్షితుడయ్యాడు. తనకు ఇన్‌స్టాలో పరిచయమైన వారిని కలిసేందుకు 2024 నవంబరు 22న ముంబయికి వెళ్లాడు. అంతకుముందు 2024 జనవరి 26న సహబాజ్, జీషాన్‌లను కలవడానికి ఢిల్లీ వెళ్లాడు. సౌదీలో ఉంటున్న బీహార్‌కు చెందిన అబూతాలమ్ అలియాస్ అబూముసాబ్ అనే వ్యక్తి సూచనతో తాను తరచూ సిగ్నల్ యాప్ ద్వారా జిహాదీ చర్యల వైపు ఆకర్షితుడైనట్లు పోలీసులకు తెలిపాడు.
- పేలుళ్ల సామగ్రిని విజయనగరంలోని కేఎల్ పురం, కన్యకా పరమేశ్వరీ ఆలయ ప్రాంతంలో కొనుగోలు చేసి, ఐఈడీ బాంబులను తయారు చేసి ముందుగా విజయనగరంలో జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతంలో పేల్చేందుకు నిర్ణయించుకున్నామని, అందుకు ప్రణాళిక సిద్ధం చేస్తుండగా పోలీసులకు పట్టుబడినట్లు ఎఫ్ఐఆర్‌లో పేర్కొని ఉంది.

జీవితంలో యోగా భాగం కావాలి

కలెక్టర్ అంబేడ్కర్



యోగాసనంలో కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, మే 21(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒకరి జీవితంలో యోగా ఒక భాగం కావాలని, మన ప్రాచీన సంస్కృతిలో యోగా భాగమని, దీనిని అందరూ అభ్యసించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ అంబేడ్కర్ సూచించారు. స్థానిక రాజీవ్ క్రీడా మైదానంలో యోగా భ్యాస కార్యక్రమాన్ని కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, జేసీ సేతు మాధవన్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగాపై ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం కల్పించాలన్న ఉద్దేశంతో పదేళ్ల క్రితం ప్రధాని నరేంద్రమోదీ యోగా దినోత్సవానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. జూన్ 21న జరిగే ప్రపంచ యోగా దినోత్సవ కార్యక్రమానికి ప్రధాన మంత్రి మన రాష్ట్రానికి రావడం ఎంతో గౌరవప్రదమన్నారు. యోగాపై గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ విస్తృత ప్రచారం కల్పించి, ప్రతి ఒక్కరిచేత యోగాసనాలను అభ్యసన చేయించే ఉద్దేశంతో నెల రోజుల పాటు భారీ ఎత్తున కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్య సాధనకు యోగా ఒక చక్కని మార్గమని చెప్పారు. జేసీ సేతుమాధవన్ మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా వారోనికో ప్రచార కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు.

టీడీపీని బలోపేతం చేయండి

- పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అశోక్ గజపతిరాజు పిలుపు
- సందడిగా జిల్లా మహానాడు
- ఎనిమిది తీర్మానాలకు ఆమోదం



ఐక్యతను చాటుతున్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, జిల్లా అధ్యక్షుడు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, నాయకులు





మాట్లాడుతున్న అశోక్, కళావెంకట్రావు



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

విజయనగరం/విజయనగరం రూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీని జిల్లాలో మరింత బలోపేతం చేసి, ముందుకు నడిపించాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అశోక్ గజపతిరాజు పిలుపునిచ్చారు. విజయనగరంలోని మెసానిక్ టెంపుల్ వేదికగా బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి మహానాడులో ఆయన కీలకంగా ఉపన్యాసించారు. తొలుత పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత నేత ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులంతా పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఏడాది కాలంలో వివిధ నియోజకవర్గాల్లో మరణించిన టీడీపీ కార్యకర్తలకు సంతాప సూచికంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున అధ్యక్షతన ప్రారంభమైన సభలో అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు 2019 నుంచి 2024 వరకూ ఎన్నో కష్టాలు, ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఐదేళ్ల పిచ్చోడి (జగన్) పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. ఆ సమయంలో విజయనగరంలో మాదక ద్రవ్యాలు విచ్చలవిడిగా **(మిగతా 8వ పేజీలో..)**

తీర్మానాలు

- నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు చూపాలని చీపురుపల్లి నియోజకవర్గ నాయకుడు కిమిడి రామ్ మల్లిక్ నాయుడు తీర్మానించగా టీడీపీ నాయకుడు కరణం శివరామకృష్ణ బలపరిచారు.
- పోలవరం ప్రాజెక్టుపై ప్రభుత్వ మాజీ విప్ గద్దె బాబురావు తీర్మానం ప్రవేశపెట్టగా మాజీ ఎమ్మెల్యే కొండపల్లి అప్పలనాయుడు బలపరిచారు.
- భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణ తీర్మానాన్ని మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు ప్రవేశపెట్టగా, బొబ్బిలి ప్రాంతానికి చెందిన చింతల రామకృష్ణ బలపరిచారు.
- విజయనగరం - పాలకొండ రోడ్డును నాలుగు లైన్లుగా నిర్మించాలని కొల్ల అప్పలనాయుడు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.
- విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మెట్రో రైలు అంశంపై తీర్మానం ప్రవేశపెట్టారు.
- ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ మహిళా సాధికారిత, అభివృద్ధి, సంక్షేమం విషయమై తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.
- ఆపరేషన్ సిందూర్ విజయవంతం, ఉగ్రవాద దాడికి ధీటైన సమాధానం ఇవ్వడంలో ప్రధాని మోదీ మద్దతుగా నిలిచిన చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానాన్ని కళా వెంకటరావు ప్రతిపాదించారు.
- దేశానికి విశేష సేవ చేసిన ఇద్దరు శాస్త్రవేత్తలు ఒకే రోజు చనిపోవడం బాధకరమని, వారి సేవలకు ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానాన్ని అశోక్ గజపతిరాజు ప్రవేశపెట్టారు. అన్నింటికీ సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు.

మండుటెండలో 'ఉపాధి'

- సౌకర్యాల కల్పనపై దృష్టిపెట్టని అధికారులు
- వేతనాల చెల్లింపుల్లోనూ నిర్లక్ష్యమే
- వేతనదారులకు తప్పని అవస్థలు

7లో

టీచర్ల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

- పాయింట్ల కేటాయింపునకు మార్గదర్శకాలు జారీ
- ఉపాధ్యాయ వర్గాల్లో హర్షాతిరేకాలు



రాజాం రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో ఉపాధ్యాయ సంఘాలతో నిర్వహించిన చర్చలు సఫలం కావడంతో టీచర్ల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. బదిలీల ప్రక్రియ, తేదీలకు సంబంధించిన షెడ్యూల్‌తో పాటు పాయింట్ల కేటాయింపు తదితర మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. వాస్తవానికి ఇప్పటికే బదిలీల ప్రక్రియ జరగాల్సి ఉండగా పలు డిమాండ్లతో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఉద్యమానికి పిలుపునివ్వడంతో బదిలీల ప్రక్రియకు బ్రేక్ పడింది. తాజాగా చర్చలు సఫలం కావడంతో ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమాన్ని విరమిస్తున్నట్లు ప్రకటించాయి. దీంతో టీచర్ల బదిలీలకు సంబంధించి వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. మొత్తం బదిలీల ప్రక్రియ పూర్తయ్యాక జూన్ 11న బదిలీ ఉత్తర్వులు ఇవ్వనున్నారు.

దరఖాస్తు చేయాలిలా..

సెకెండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు ఈనెల 21 నుంచి ఈనెల 27 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించారు. వీటి పరిశీలన ఈనెల 28 వరకూ ఆన్‌లైన్‌లో కొనసాగనుంది. వీరి బదిలీల ప్రక్రియను కౌన్సెలింగ్ ద్వారా నిర్వహిస్తారు.

- ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు (గ్రేడ్ 2 హెచ్ఎంలు) ఈనెల 22 వరకూ రెండు రోజులు మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వీరంతా ఈనెల 28న ఒక్కరోజే ఆప్షన్స్ ఇవ్వాల్సి ఉంది.
- స్కూల్ అసిస్టెంట్లు ఈనెల 21 నుంచి 24 వరకూ ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. వీరంతా జూన్ 1, 2 తేదీలలో ఆప్షన్స్ ఇవాల్సి ఉంటుంది.

పాయింట్ల కేటాయింపు ఇలా..

● కేటగిరీ 1 (పట్టణ ప్రాంతాలు) సంవత్సరానికి ఒక పాయింట్ ● కేటగిరి 2 (మున్సిపల్ ప్రాంతాలు) సంవత్సరానికి రెండు పాయింట్లు ● కేటగిరి 3 (గ్రామీణ ప్రాంతాలు) సంవత్సరానికి మూడు పాయింట్లు ● కేటగిరి 4 (మారుమూల ప్రాంతాలు)సంవత్సరానికి అయిదు పాయింట్లు ● పనిచేసిన మొత్తం సర్వీస్ కాలానికి .. సంవత్సరానికి అర పాయింట్ ● భార్య, భర్తలు ప్రభుత్వ ఉద్యోగులైతే.. ఐదు పాయింట్లు.. (ఒకరికి మాత్రమే వర్తిస్తుంది) ● అవివాహిత మహిళా ఉపాధ్యాయులకు ఐదు పాయింట్లు ● 40 - 55 శాతం మధ్య శారీరక వైకల్యం లేదా 60 - 70 శాతం మధ్య వినికిడి లోపం ఉన్నవారికి ఐదు పాయింట్లు ● 40 శాతం దృష్టిలోపం లేదా 56 -59 శాతం మధ్య శారీరక వైకల్యం ఉన్నవారికి ఏడు పాయింట్లు ● ప్రభుత్వ గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులకు ఐదు పాయింట్లు ● విడాకులు తీసుకుని **(మిగతా 8వ పేజీలో..)**

సరికొత్త హంగులతో..

- ఎన్టీఆర్ అడ్వంచర్ పార్కు ముస్తాబు
- పర్యాటకులను ఆకర్షించేందుకు ఏర్పాట్లు
- ఆదాయ మార్గాల వైపు అడుగులు

6లో



ఎండీయూ సేవలకు ఇక సెలవు

6లో

- వచ్చే నెల నుంచి డిపోల వద్ద సరుకుల పంపిణీ

సరికొత్త హంగులతో..



ఎన్టీఆర్ అడ్వంచర్ పార్కు ముఖద్వారం

- ఎన్టీఆర్ అడ్వంచర్ పార్కు ముస్తాబు
- పర్యాటకులను ఆకర్షించేందుకు ఏర్పాట్లు
- ఆదాయ మార్గాల వైపు అడుగులు

సీతంపేట రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి)

సీతంపేటలోని ఎన్టీఆర్ అడ్వంచర్ పార్కుకు కొత్త హంగులు సమకూరుస్తున్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లుగా పర్యాటక ప్రాంతాల అభివృద్ధిని గాలికి వదిలేసింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన కొద్దిరోజుల్లోనే సీతంపేట మన్యంలోని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా అడలి వ్యూ పాయింట్‌ను సుందరంగా తీర్చిదిద్ది.. పర్యాటకులకు అంకితం చేశారు. సీతంపేటలోని ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌కు కొత్త హంగులను తీసుకు వస్తున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు ఇంకా విడుదల కాకపోయినప్పటికీ పార్కు నుంచి వచ్చే ఆదాయాన్ని వినియోగించుకొని పర్యాటకులను ఆకర్షించే క్రీడలు, ఫొటో షూట్‌కు అనుకూలమైన బొమ్మలను ఏర్పాటు చేస్తున్నారు. ఆదాయ మార్గాల అన్వేషణలో భాగంగా సీతంపేట పార్కును అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు ప్రారంభించారు. పార్కులో పచ్చని గడ్డిని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

కొత్త కొత్తగా...

స్థానిక ఎన్టీఆర్ అడ్వంచర్ పార్కులో పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రత్యేక హంగులు ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా మరమ్మతులకు గురై మూలకు చేరిన ఆల్‌టెర్రయిన్ వాహనాలను పునరుద్ధరించారు. కొత్తగా రెండు ఏటీవీ వాహనాలను కొనుగోలు చేసి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. కొత్తగా ఉడెన్ ఆర్చ్, సీతాకోక చిలుక బొమ్మ, కర్రల బెంచీలు ఏర్పాటు చేశారు. ఫొటో షూట్‌ల కోసం పార్కుకు వచ్చే పర్యాటకుల కోసం వీటికి ప్రత్యేక రంగులు వేసి తీర్చిదిద్దారు. వీటితో పాటు మరికొన్ని హంగులు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



చెక్కలతో తయారు చేసిన బెంచీ..

అదనపు ఆకర్షణగా...

ఎన్టీఆర్ అడ్వంచర్ పార్కులో మరికొద్ది రోజుల్లో మరిన్ని ఆకర్షణీయమైన క్రీడలను ఏర్పాటు చేసేందుకు పీవో యశ్వంత్ కుమార్ రెడ్డి ప్రణాళికలు తయారు చేస్తున్నారు. పర్యాటకుల కోసం సుమారు రూ.50 లక్షలు వెచ్చించి స్విమ్మింగ్ పూల్ విత్ స్లైడ్స్, గిరి గ్రామదర్శిని, డ్రైవిన్ వంటి వినోద క్రీడలతో పాటు ఫొటోషూట్ కోసం 7 ప్రత్యేకమైన పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు. వీటి ద్వారా అదనపు ఆదాయం సమకూర్చడంపై దృష్టి పెడుతున్నారు. కూటమి ప్రభుత్వం సీతంపేట ఈ పార్కు అభివృద్ధి కోసం రూ.కోటి కేటాయిస్తున్నట్లు ఐదు నెలల క్రితం ప్రకటించినప్పటికీ ఆ నిధులు ఇంకా మంజూరు కాలేదు. ఉన్న నిధులతో జూన్ నెలాఖరు నాటికి అన్ని పనులు పూర్తి చేసేందుకు చర్యలు ప్రారంభించారు.

ఆదాయం వైపు దృష్టి..

కూటమి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఐటీడీఏ అధికారులు సంపద సృష్టిపై దృష్టి సారించారు. తక్కువ పెట్టుబడితో ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అన్వేషిస్తున్నారు. అదే సమయంలో గిరిజన నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నారు. పార్కుకు పెయింటింగ్స్, గ్రాస్ కటింగ్ వంటి పనులతో పాటు మరికొన్ని హంగులను కల్పిస్తున్నారు. ఇవన్నీ పర్యాటకులను మరింతగా ఆకర్షిస్తాయని ఐటీడీఏ అధికారులు చెబుతున్నారు.


స్విమ్మింగ్‌పూల్ స్లైడ్స్

తారు రోడ్లను చూసే భాగ్యమెప్పుడో!

- శిలాఫలకంతోనే నిలిచిన పనులు
- నిమ్మలవలస, కోనూరు ప్రజలకు తప్పని ఇక్కట్లు

చీపురుపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి, గరివిడి మండలాల్లోని నిమ్మలవలస, కోనూరు గ్రామాల ప్రజలు ఎప్పటి నుంచో తారురోడ్ల కోసం ఎదురుచూస్తున్నారు. అందుకు తగ్గట్టు గత ప్రభుత్వ హయాంలో తారురోడ్డు నిర్మాణానికి 2024 మార్చి 10న అప్పటి మంత్రి బొత్స సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. దీంతో వారంతా ఎంతో సంతోషించారు. తమ కష్టాలకు ఫుల్‌స్టాప్ పడినట్టేనని మురిసిపోయారు. కానీ పనులు ప్రారంభం కాలేదు. అక్కడికి కొద్ది కాలం తరువాత ఎన్నికలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. ఆ రోడ్లు మాత్రం అలాగే ఉన్నాయి. చీపురుపల్లి మండలంలోని కర్లాం నుంచి నిమ్మలవలసకు రూ.2.25 కోట్లు, జి.ములగాం నుంచి గరివిడి మండలంలోని కోనూరుకు రూ.7 కోట్లతో తారురోడ్ల నిర్మాణానికి అప్పటి మంత్రి బొత్స శంకుస్థాపన చేశారు. 2024లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఆ పనులు నిలిచిపోయాయి. వాస్తవానికి ఈ రెండు రోడ్లకు చాలా ప్రాధాన్యం ఉంది. జి.ములగాం నుంచి తమ గ్రామానికి తారురోడ్డు వేయాలని కోనూరు గ్రామస్థులు దశాబ్దాలుగా కోరుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణం వల్ల చీపురుపల్లి మండలంలోని సగం గ్రామాలకు, అటు నెల్లిమర్ల మండలం, శ్రీకాకుళం జిల్లాలోని అనేక గ్రామాలకు ప్రయాణం సులభతరమవుతుంది. అలాగే కర్లాం నుంచి నిమ్మలవలసకు కూడా తారు రోడ్డు కావాలని ఎప్పటి నుంచో దేవరపొదిలాం, చొక్కరపాలెం, గుణిదాం గ్రామస్థులు కోరుతున్నారు. ఈ రహదారి పూర్తయితే... అటు జి.సిగడాం మండలానికి కూడా కనెక్టివిటీ ఏర్పడుతుంది. ఇప్పటికైనా పాలకులు స్పందించి రెండు రోడ్లను పూర్తి చేయాలని ఆ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


మాజీ మంత్రి బొత్స ప్రారంభించిన శిలాఫలకం


ప్రస్తుతం ములగాం-కోనూరు రోడ్డు ఇలా...

ఘనసర ప్రాంతంలో గజరాజులు

- ఆందోళనలో ప్రజలు
- పొలం పనులకు కష్టమని ఆవేదన

భామిని, మే 21 (ఆంధ్రజ్యోతి): భామిని మండలంలోకి మళ్లీ ఏనుగులు ప్రవేశించాయి. గత మూడు వారాలుగా మండలంలో వీటి అలికిడి లేదు. బుధవారం వేకువజామున ఘనసర, కోసలి గ్రామాల మధ్య ఏనుగులు దర్శనమిచ్చాయి. సుమారు 20 రోజుల క్రితం భామిని మండలాన్ని విడిచిపెట్టి కురుపాం మండలం తిత్తిరి, నేరడిగూడ ప్రాంతాలకు వెళ్లిపోయాయి. మళ్లీ ఘనసర ప్రాంతానికి చేరడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు సూచిస్తున్నారు. కీసర, కోసలి, ఘనసర, తాలాడతో పాటు నదీతీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీట్ ఆఫీసర్ దాలినాయుడు, జి.కేశవులు సిబ్బందితో గ్రామంలో ప్రచారం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఏనుగులు లేకపోవడంతో పనులు ప్రశాంతంగా చేసుకొనేవారమని స్థానికులు చెబుతున్నారు. మళ్లీ ఇవి రావడంతో పొలం పనులకు తీవ్ర ఇబ్బందులు పడతామని, చీకటి పడితే భయపడక తప్పడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


ఘనసర, కీసర మధ్య సంచరిస్తున్న ఏనుగులు


ఘనసరలో రీసర్వే తీరును పరిశీలిస్తున్న పీవో

గృహ నిర్మాణాలు వేగవంతం

- ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

భామిని, మే 21 (ఆంధ్రజ్యోతి): పీఎం జన్మన్ ద్వారా మంజూరైన గృహాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆదేశించారు. బుధవారం ఆయన భామిని మండలంలో పర్యటించారు. తొలుత తాలాడ పంచాయతీలోని తాటిమానుగూడ గ్రామానికి చేరుకొని... గృహ నిర్మాణాలను పరిశీలించారు. నిర్మాణ పనులను వేగవంతం చేయడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆదివాసీ గిరిజనులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణానికి బిల్లుల చెల్లింపులో జాప్యం అవుతోందని ఆయన దృష్టికి వారు తీసుకెళ్లారు. దీనిపై పీవో స్పందిస్తూ ఇప్పటివరకు నిర్మించిన గృహాలకు బిల్లులు చెల్లించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఘనసర, లోహరజోలలో చేపడుతున్న భూముల రీసర్వేపై ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో సర్వే చేసే విధానం, నమోదు చేయడంపై సిబ్బందితో చర్చించి... వారికి సూచనలు చేశారు. అనంతరం ఘనసర ఆధార్ సెంటర్, పాలీష్‌కోట గ్రామంలో వనతల్లి వీడీవీకే కేంద్రాన్ని పరిశీలించారు. కాట్రగడ గ్రామంలో చేపడుతున్న జలజీవన్‌మిషన్ పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎన్.శివన్నారాయణ, సర్వేయర్ రాజేష్, ఆర్ఐ మణిపాత్రో, సిబ్బంది పాల్గొన్నారు.

ఎండీయూ సేవలకు ఇక సెలవు

- వచ్చే నెల నుంచి డిపోల వద్ద సరుకుల పంపిణీ



విజయనగరం కలెక్టరేట్, మే 21 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ రేషన్ సరఫరా చేసిన మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్ల (ఎండీయూ) సేవలు వచ్చే నెల నుంచి నిలిచిపోతున్నాయి. దీనిపై పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం పౌర సరఫరాల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో స్పష్టత కూడా ఇచ్చినట్లు తెలిసింది. ప్రస్తుతం ఉన్న వాహనాలను కార్పొరేషన్లకు అప్పగించాలని ఆదేశించారు. జూన్ నెల నుంచి రేషన్ డిపోల నుంచి సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. ఇప్పటికే డిపోలు ఎక్కడ ఉన్నాయో చాలా మంది కార్డుదారులకు తెలియని పరిస్థితిలో ఉన్నారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సూచించారు. దీంతో చౌక ధరల దుకాణాలను డీలర్లు శుభ్రం చేసే పనిలో పడ్డారు. స్థానిక ప్రజలను పిలిచి డిపోలను ప్రారంభించనున్నారు. దీంతో పాత విధానం అమలు కానుంది. నేరుగా కార్డుదారులు డిపోలకు వెళ్లి సరుకులు తీసుకోవలసి ఉంది. వైసీపీ హయాంలో కార్డుదారులకు ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేయాలనే ఉద్దేశంతో 2020 ఫిబ్రవరిలో ఎండీయూలను ఏర్పాటు చేశారు. 370 ఎండీయూలు ఉండగా... 348 మాత్రమే పని చేస్తున్నాయి. గ్రామాల్లో డిపోలు ఎక్కడ ఉన్నాయో? కార్డుదారులు సులువుగా తెలుసుకుంటారు. కానీ పట్టణ ప్రాంతాల్లో మాత్రం డిపోలు ఎక్కడ ఉన్నాయో తెలుసుకోవడం కష్టం. దీనిపై అధికారులు దృష్టి పెట్టాల్సి ఉంది.

ఘనంగా వేపారమ్మ పండుగ


- కిటకిటలాడిన గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం, మే 21 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురం గ్రామదేవత వేపారమ్మ పండుగ నేపథ్యంలో బుధవారం పురవీధులు జన సంద్రంగా మారాయి. వేలాది మంది భక్తులు అమ్మవారి పూజల్లో పాల్గొన్నారు. ఈ కారణంగా గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించింది. భక్తులు అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. మహిళా భక్తులు పసుపు నీళ్ల కలశాలను తలపై పెట్టుకొని అమ్మవారి గుడికి వెళ్లి చల్లదనం చేశారు. ఔత్సాహికులు వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. బుధవారం అనుపు కార్యక్రమంలో కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎల్విన్‌పేట పోలీసులు, కమిటీ సభ్యులు జాగ్రత్తలు తీసుకున్నారు.


కలశాలతో భక్తులు


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జగదీశ్వరి


వేపారమ్మ గుడి వద్ద భక్తుల సందడి



శ్యామలాంబ ఆలయంపై మబ్బుల పందిరి

సాలూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఉన్న శ్యామలాంబ అమ్మవారి ఆలయంపై మంగళ, బుధవారాలో మబ్బులు పందిరి వేసినట్టుగా కనిపించిన దృశ్యాలు ఆకట్టుకున్నాయి. బుధవారం సాయంత్రం ఆకాశం మేఘావృతమైంది. ఆ సమయంలో చినుకులతో శ్యామలాంబకు అభిషేకం చేయడానికి కొలువుదీరినట్టు మేఘాలు కనువిందు చేశాయి.

మండుటెండలో 'ఉపాధి'

● సౌకర్యాల కల్పనపై దృష్టిపెట్టని అధికారులు

● వేతనాల చెల్లింపుల్లోనూ నిర్లక్ష్యమే ● వేతనదారులకు తప్పని అవస్థలు



తాలాడలో పనులు చేపడుతున్న వేతనదారులు

సంతకవిటి, మే 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం వేతనదారులకు శాపంలా పరిణమించింది. వేతనదారులకు సౌకర్యాల కల్పన, వేతనాల చెల్లింపులపై సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దాంతో వేతనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీనికి తోడు మండుటెండలో పనులు జరుగుతుండటంతో వారు ఆందోళన చెందుతున్నారు. పని ప్రదేశాల్లో టెంట్, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్ కచ్చితంగా ఉండాలనేది నిబంధన. అయితే దాన్ని పట్టించుకునే పరిస్థితి లేదు. మండలంలో 34 పంచాయతీల పరిధిలో జాబ్ కార్డు కలిగిన వేతనదారులు 16371 మంది ఉన్నారు. ఇందులో 14 వేల మంది జాబ్ కార్డులు యాక్టివ్‌లో ఉన్నాయని ఏపీవో హరినాథరావు తెలిపారు. అయితే మండలంలోని వేతనదారులకు 100 రోజుల పని కల్పించడం ప్రశ్నార్థకంగా మారింది.

సమకూరని గిట్టుబాటు ధర..

కేంద్ర ప్రభుత్వం ఉపాధి వేతనదారులకు రోజు వారీ గరిష్ఠ వేతనం రూ.307గా నిర్ణయించింది. పనులు జరిగేచోట వేతనదారులతో ప్రణాళికబద్ధంగా పనులు చేయిస్తే గరిష్ఠ వేతనం పొందడం ఏమీ కష్టం కాదు. అయితే క్షేత్రస్థాయిలో సిబ్బంది పనులను పర్యవేక్షించని ఫలితంగా వేతనదారులకు రూ.140 నుంచి రూ.200 లోపే రోజువారీ వేతనాలు అందుతున్నాయి. కేంద్రం ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర



మోదుగులపేటలో చెట్టు నీడలో సేదతీరుతున్న వేతనదారులు

వేతనదారులుకు అందడం గగనమవుతోంది.

దొంగ మస్తర్లు కూడా..

ఉపాధి పనుల్లో దొంగ మస్తర్ల నమోదు అక్కడక్కడా జరుగుతోంది. దాన్ని అధిగమించేందుకు ఉపాధి పనులకు వెళ్లే వేతనదారుల గ్రూపుల వారీగా ఫొటోలు అప్‌లోడ్‌తో హాజరు వేస్తున్నారు. అయినా అక్రమాలు జరుగుతున్నాయి. ఇటీవల మండలంలోని చిత్తారపురం పంచాయతీలో వెలుగు చూసిన దొంగ మస్తర్లను బాగోతాన్ని ఉదహరించవచ్చు.

● చర్యలు తీసుకుంటున్నాం..

ఉపాధి పనులు జరిగేచోట సదుపాయాలు కల్పించడం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. గతంలో వేతనదారులకు నీడ ఏర్పాటు చేసందుకు ప్రభుత్వం టెంట్లు మంజూరు చేసింది. కొన్ని ప్రాంతాల్లో నీడ కోసం వాటిని వినియోగిస్తున్నాం. మరికొన్ని ప్రాంతాల్లో నీడను ఏర్పాటు చేసుకోవాలని వారికి సూచించాం.

-కె.సురేష్‌కుమార్, ఎంపీడీవో, సంతకవిటి

● అవగాహన కల్పిస్తున్నాం..

కేంద్ర ప్రభుత్వం పెంచిన వేతనంపై కూలీలకు అవగాహన కల్పించాలని సిబ్బంది, క్షేత్ర సహాయకులను ఆదేశించాం. ఎలా పనులు చేస్తే కూలీ గిట్టుబాటు అవుతుందో వేతనదారులకు క్షేత్రస్థాయి సిబ్బంది వివరించేలా చూస్తాం. పని ప్రదేశాలలో చలువ పందెర్లు ఏర్పాటు చేయాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికత్స కిట్లను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం.

-రమామణి, ఏపీడీ, రాజాం

కేసులను పరిష్కరించుకోండి

గజపతినగరం, మే21 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 5న నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవాలని న్యాయాధికారి ఎ.విజయ్‌రాజ్‌కుమార్ బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో కోరారు. పెండింగ్ కేసులపై పోలీసులు కక్షిదారులకు అవగాహన కల్పిం చాలని న్యాయాధికారి సూచిం చారు.

సురేష్‌కు అభినందనల వెల్లువ

గరివిడి, మే 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడిగా వరుసగా రెండోసారి నియమితులైన సారిపాక సురేష్‌కుమార్‌ను పలువురు అభినందించారు. బుధవారం ఆయన్ని మండలంలోని టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా కామునాయుడు

చీపురుపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ చీపురుపల్లి మండల అధ్యక్షుడిగా రౌతు కామునాయుడు వరుసగా ఏడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సుదీర్ఘకాలం పట్టణ పార్టీ అధ్యక్షుడిగా, 2012లో జిల్లా ఉపాధ్యక్షుడిగా సేవలందించారు. పార్టీకి విధేయుడిగా ఉన్న ఆయన్ని మరోసారి మండల పార్టీ అధ్యక్షుడినిగా నియమించింది. కామునాయుడును పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లిమర్ల, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండవెలగాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్‌ల నిర్వహణ నిమిత్తం గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని విజయనగరం టౌన్ డివిజన్ ఈఈ పి.త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని చినబూరాడపేట, పారసాం, గెద్దపేట, గుర్ల మండలం నడుపూరు, భూపాలపురం, ఆనందపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

●విజయనగరం రింగురోడ్డు, మే 21(ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఈఈ త్రినాథరావు ఓ ప్రకటనలో తెలిపారు. గుండాల వీధి, జిడ్డువారి వీధి, కానుకూర్తివారి వీధి, సింహచలం మేడ, కోట ప్రాంతం, ఎంఆర్ కళాశాల, ఏజీ రోడ్డు, గురజాడ అప్పారావు రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

విజయనగరం రింగురోడ్డు,మే 21 (ఆంధ్రజ్యోతి): పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ ఆఫ్ దుబాయ్, పిరమిడ్ యోగా అండ్ డాన్స్ అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన నృత్య ప్రదర్శనలో విజయనగరానికి చెందిన ప్రవళ్లిక నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈనెల 21న దుబాయ్ కాన్సలేట్ హాల్‌లో నిర్వహించిన పోటీల్లో భారత్‌కు చెందిన సాయినాథ్ కళాకమిటీ, ఎస్.కె అకాడమీ ప్రతినిధులు తెలిపారు. పోటీల్లో ప్రవళ్లిక దుర్గా దేవిగా భారతీయ నృత్య రీతులు ప్రద ర్శించి అందరినీ ఆకట్టుకుందన్నారు. నృత్య యువ ప్రతిభ అవార్డును సాధించిందని తెలిపారు.

అంబేడ్కర్ చరిత్ర పుస్తకాలను అందజేస్తాం

శృంగవరపుకోట, మే 21(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు అంబేడ్కర్ చరిత్ర పుస్తకాలను ప్రజలకు అందించి ఆ మహనీయుడి గొప్పతనం అందరికీ తెలిసేలా చేస్తామని ప్రజా వాగ్గేయ కారుడు ఆతవ ఉదయ్‌భాస్కర్ అన్నారు. బుధవారం ఎస్.కోట దేవికూడలిలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బుగత వెంకటేశ్వరరావు, ఉద్యమ కారుడు డప్పు రాజు, బోనెల ఈశ్వరరావు, మెయ్యి వెంకటరమణ తదితరులున్నారు.

నేడు శోభాయాత్ర

విజయనగరం రింగురోడ్డు, మే 21(ఆంధ్రజ్యోతి): నగరంలో గురువారం హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తామని సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.వేణుగోపాలరావు తెలిపారు. బుధవారం స్థానిక కోదండరామస్వామి ఆలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

నేడు హనుమాన్ జయంతి

నెల్లిమర్ల, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని రామస్వామివారి దేవస్థానంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలు జరుగనున్నాయి. ఇందుకు సంబంధించి దేవస్థానం అధికారులు, వైదిక సిబ్బంది ఏర్పాట్లు పూర్తి చేశారు.

మంచి డిజైన్‌ను రూపొందించండి



భవనాల డిజైన్లను చూస్తున్న జిల్లా న్యాయాధికారి

శృంగవరపుకోట, మే 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్మించబోయే నూతన కోర్టు భవన నిర్మాణానికి మంచి డిజైన్ రూపొందించాలని ఆర్అండ్‌బీ అధికారులను జిల్లా న్యాయమూర్తి ఎం.బబిత ఆదేశించారు. బుధవారం ఎస్.కోటలో అద్దె భవనంలో కొనసాగతున్న కోర్టును ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులు రూపొందించిన డిజైన్లను పరిశీలించారు. కోర్టు భవనం కోసం రూ.8.50 కోట్లు, న్యాయాధికారి నివాసానికి రూ.2.23 కోట్లు, పాత భవనం తొలగింపునకు రూ.7 లక్షలు కేటాయింపులు జరిగాయని అధికారులు వివరించారు. నూతన భవనం జి ప్లస్-2 విధానంలో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక బార్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

దివ్యాంగులను చైతన్యపరచండి: ఆర్డీవో



మాట్లాడుతున్న ఆర్డీవో ఆశయ్య

చీపురుపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ఓటింగ్‌లో ఉత్సాహంగా పాల్గొనే విధంగా అధికారులు వారిని చైతన్యపరచాలని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, ఇన్‌చార్జి ఆర్డీవో బి.ఆశయ్య సూచించారు. బుధవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వృద్ధులు, ప్రత్యేక అవసరాలు కలిగిన ఓటర్లకు పోలింగ్ రోజున కల్పిస్తున్న సౌకర్యాలను వారికి వివరించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొనేలి అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో తహసీల్దారు ఎన్.రాజారావు, ఎంపీడీవో ఎల్.త్రినాథ్, ఎంఈవో బూసినాయుడు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను సత్కరించిన ఆశ్రమ నిర్వాహకులు

జామి, మే 21(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి చక్కటి ప్రణాళిక, క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సైనిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి మజ్జి కృష్ణారావు అన్నారు. బుధవారం మండలంలోని అట్టాడ బీఎస్ఆర్ ఆశ్రమంలో టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో పౌరవేదిక జిల్లా అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించిన బీఎస్ఆర్ ఆశ్రమ వ్యవస్థాపకురాలు శారదను అభినందించారు. ఈ సందర్భంగా మండలంలోని కుమారాం కస్తూర్బా విద్యాలయం, కుమారాం, జామి, విజినిగిరి, అలమండ, లోట్లపల్లి ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో బ్యాంకు విశ్రాంత అధికారి ప్రభాకరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాలరాముడి ధనుస్సుకు పూజలు

బొండపల్లి, మే 21(ఆంధ్రజ్యోతి): అయోధ్యలోని బాలరాముడి ధనుస్సు, రామ బాణం దర్శనం దివ్యమైనదని అయోధ్య రామాలయం వేదపండితుడు చల్లా శ్రీనివాసశాస్త్రి అన్నారు. బుధవారం మండలంలోని వేండ్రాంలో శ్రీరామదండు యువత ఆధ్వర్యంలో 30 కిలోల పంచలోహ బాలరాముడు ధనుస్సు, రామబాణాన్ని రామాలయం వద్ద భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు. ఈ సందర్భంగా భక్తులు ధనుస్సుకు పూజలు నిర్వహించారు.

పనుల్లో నాణ్యత పాటించండి

రాజాం, మే 21 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్డు, డ్రైన్ పనుల్లో నాణ్యత పాటించాలని ఎంపీడీవో శ్రీనివాసరావు ఆదేశించారు. బుధవారం సోపేరు గ్రామంలో చేపడుతున్న సీసీ డ్రైన్ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం బొద్దాం, కంచరాం సచివాలయాలను సందర్శించారు. మనమిత్ర వాట్సాప్‌పై ఇంటింటా అవగాహన కల్పించాలన్నారు. పెండింగ్ సర్వేలు. ఈకెవైసీలు సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు.

23 మంది ఉద్యోగాలకు ఎంపిక

మెరకముడిదాం, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమలింగాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 23 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. రెడ్డీస్ ల్యాబ్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా జరిగింది. మేళాకు 70 మంది హాజరుకాగా 23 మందిని రెడ్డీస్ ల్యాబ్ సంస్థ ప్రతినిధులు నాగేశ్వరరావు, ప్రతాప్‌రెడ్డి ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు రామ్మూర్తిరాజు, వెంకటపతిరాజు, బంగారు రాజు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు కల్పించండి



జాబ్ మేళా పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

లక్కవరపుకోట, మే 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో విద్యావంతులకు ఉపాధి కల్పించేందుకు స్థానిక కళాశాలలు ముందుకు రావాలని ఎమ్మెల్యే లలితకుమారి పిలుపునిచ్చారు. స్థానిక కంపెనీలతో పాటు ఇతర కంపెనీలతో సంబంధాలు ఏర్పరచుకుని నిరుద్యోగ యువతకు దారి చూపాలన్నారు. బుధవారం ఆమె నివాసంలో ప్రగతి డిగ్రీ కళాశాలకు చెందిన జాబ్ మేళా పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ నెల 23 శుక్రవారం ఉదయం కొత్తవలస కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. టెన్త్ నుంచి పీజీ వరకు టెక్నికల్‌కు సంబంధించిన అన్నిరకాల ఉద్యోగ అవకాశాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



క్రీడాకారులతో కలిసి యోగాసనాలు వేస్తున్న ఎమ్మెల్సీ

శృంగవరపుకోట, మే 21 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం నెలరోజుల పాటు నిర్వహించనున్న యోగాంధ్ర దినోత్సవంలో భాగంగా క్రీడాకారులతో కలిసి ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు యోగాసనాలు వేశారు. బుధవారం పట్టణంలోని స్థానిక కేంబ్రిడ్జ్, నారాయణ పాఠశాలలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వారితో కలిసి యోగాసనాలు వేశారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. ●అలాగే పట్టణంలోని మోక్ష విద్యామందిర్ ఆధ్వర్యంలో యోగాంధ్ర దినోత్సవ ర్యాలీని బుధవారం నిర్వహించారు. ర్యాలీలో విద్యామందిర్ ప్రతినిధులు కోటేశ్వరరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు. దేవి కూడలిలో మానవహారం నిర్వహించారు.

షర్మిలకు సంఘీభావం



షర్మిలతో మాట్లాడుతున్న కుప్పిలి

రాజాం, మే 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ పీసీసీ చీఫ్ షర్మిలరెడ్డి ఆమరణ నిరాహారదీక్షకు చేపడుతున్న నేపథ్యంలో బుధవారం ఆమెకు రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి కుప్పిలి చైతన్యకుమార్ సంఘీభావం తెలిపారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేయాలన్నారు. స్టీల్ ప్లాంట్ కార్మికులకు న్యాయం జరిగితే కాంగ్రెస్ పార్టీకి మంచి గుర్తింపు వస్తుందన్నారు.

ఎండీయూ రద్దుపై డీలర్ల సంఘం హర్షం



మంత్రి నాదెండ్లను కలిసిన ఉమామహేశ్వరరావు

శృంగవరపుకోట, మే 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థ రద్దు చేయడంపై రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలో డీలర్ల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుందన్నారు. తమపై విశ్వాసంతో లబ్ధిదారులకు సక్రమంగా రేషన్ ఇచ్చి ప్రభుత్వ నమ్మకాన్ని నిలబెడతామన్నారు. ఎండీయూ వ్యవస్థ రద్దు చేయడంతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, లోకేశ్, నాదెండ్ల మనోహర్‌లను కలిసి కృతజ్ఞతలు తెలిపామన్నారు.

మేడమిర్తిలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

సంతకవిటి, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడమిర్తిలో లోవోల్టేజీ సమస్యను గుర్తించిన విద్యుత్ శాఖ అధికారులు బుధవారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. విజయనగరం రూరల్ ఈఈ జి.సురేష్‌బాబు, రాజాం డీఈఈ ఫణీంద్రకుమార్, సంతకవిటి ఏఈ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు జరిగాయి. దీంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.

నేటి నుంచి లెప్రసీ పరీక్షలు

లక్కవరపుకోట (కొత్తవలస), మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తవలస పీహెచ్‌సీ పరిధిలో దేశపాత్రునిపాలెం, కంటకాపల్లి, కొత్తసుంకరపాలెం, కొత్తవలస-2ల్లో గురువారం నుంచి లెప్రసీ పరీక్షలు నిర్వహించనున్నట్టు వైద్యాధికారి సీతల్ వర్మ ప్రకటనలో తెలిపారు. మూడురోజుల పాటు గ్రామాల్లో సర్వే చేస్తారన్నారు.

బినామీ మస్తర్లపై చర్యలు తీసుకోండి



సమస్యలను వివరిస్తున్న సర్పంచ్‌లు

గంట్యాడ, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరవలో బినామీ మస్తర్లు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పీరుబండి హైమావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులపై జరిగిన సమీక్షలో.. ప్రైవేట్ ఉద్యోగులు, ప్రైవేట్ కళాశాలల లెక్చరర్లు నరవలో చేపట్టిన ఉపాధి పనులు చేపట్టినట్టు మస్తర్లు వేశారని సర్పంచ్ పతివాడ భాస్కరరావు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. సంబంధిత మేట్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే మండలంలోని పలు రహదారుల్లో కల్వర్టులు పూర్తిగా దెబ్బతిన్నాయని మురపాక సర్పంచ్ ఈదుబిల్లి రమేష్ ప్రస్తావించారు. తక్షణమే కల్వర్టులను బాగుచేయాలని కోరారు. ఈ సమావేశానికి ఆర్అండ్‌బీ అధికారులు హాజరు కాకపోవడంతో నోటీసు జారీ చేస్తామని ఎంపీడీవో రమణమూర్తి అన్నారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు వర్రి నర్సింహమూర్తి, తహసీల్దార్ నీలకంఠేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాన్, బైక్ ఢీ: ఒకరి మృతి

●ఇద్దరికి గాయాలు

పార్వతీపురం రూరల్/బెలగాం, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాలగూడ వద్ద బుధవారం పౌల్ట్రీ వ్యాన్, ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరు మృతి చెందాడు. ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు, అవుట్ పోస్ట్ పోలీసుల కథనం మేరకు.. ఒడిశాలోని అలమండ పంచాయతీ జగ్గుగూడ గ్రామానికి చెందిన కద్రక నారు (45) ద్విచక్ర వాహనంపై తన కుటుంబ సభ్యులు కద్రక అనంత్, కద్రక అర్జులతో కలిసి పార్వతీపురం మండలంలోని రంగాలగూడలో ఓ వివాహానికి హాజరై తిరిగి వెళ్తున్నాడు. అదే సమయంలో రంగాలగూడ శివారులోని మలుపు వద్ద ఎదురుగా ఒడిశా నుంచి వస్తున్న పౌల్ట్రీ వ్యాన్ ఢీకొంది. క్షతగాత్రులను 108లో పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా కద్రక నారు మృతిచెందాడు.

బావిలోపడి వివాహిత మృతి

రాజాం రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాయత్రి కాలనీకి చెందిన వివాహిత పోతిరెడ్డి కుమారి (45) పట్టణంలోని తెలగ వీధి సమీపంలోని నేలబావిలో పడి బుధవారం మృతి చెందింది. ఎస్ఐ రవికిరణ్ అందించిన సమాచారం మేరకు.. నాలుగేళ్ల క్రితం కుమారి రెండో కుమారుడు మృతి చెందడంతో అప్పటి నుంచి ఆమె మతిస్థిమితం కోల్పోయింది. అప్పుడప్పుడు ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లి, తిరిగి వస్తుంటుంది. నాలుగు రోజుల కిత్రం శ్రీకాకుళంలో చికిత్స చేయించి పట్టణంలోని తెలగ వీధిలోని సోదరుడు మహేశ్వరరావు ఇంటివద్ద కుమారిని ఉంచారు. అయితే ఈనెల 20న రాత్రి సోదరుడి ఇంటి నుంచి బయటకు వెళ్లిన కుమారి తెలగ వీధి సమీపంలోని నేలబావిలో పడి ఉండడాన్ని కుటుంబ సభ్యులు బుధవారం గుర్తించారు. మృతురాలి కుమారుడు సాయితేజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

పండ్ల దుకాణంలో అగ్ని ప్రమాదం

గజపతినగరం, మే21 (ఆంధ్రజ్యోతి): స్థానిక నాలుగురోడ్ల జంక్షన్‌లోని ఎం.రామకృష్ణకు చెందిన పండ్ల దుకాణంలో బుధవారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం జరిగింది. ప్రమాదానికి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణమని భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక అగ్నిమాపక కేంద్రం సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు 30 వేల వరకు ఆస్తి నష్టం జరిగిందని అగ్నిమాపక కేంద్రం అధికారి రవిప్రసాద్ తెలిపారు.

సారాతో ముగ్గురి అరెస్టు

లక్కవరపుకోట (కొత్తవలస), మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలో అప్పన్న దొరపాలెంలో బుధవారం చేపట్టిన దాడుల్లో పది లీటర్ల సారాతో ముగ్గురు పట్టుబడినట్లు ఎక్సైజ్ ఎస్ఐలు వివిఎన్.రాజు, ఎస్.రమ్యశ్రీ తెలిపారు. దాడిలో బీశెట్టి నాగమణి, జోడు పైడితల్లమ్మ, కుంచెం సూర్యనారాయణలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అలాగే పాత కేసులో దేవరాపల్లికి చెందిన సబ్బవరపు చంద్రశేఖర్, కొరువాడ గ్రామానికి చెందిన వనం చెల్లయ్యలను అరెస్టు చేశామని వారు వివరించారు.

రసాయనాలను వినియోగిస్తే చర్యలు



మామిడి పండ్లను పరిశీలిస్తున్న అధికారులు

గంట్యాడ, మే 21 (ఆంధ్రజ్యోతి): మామిడి పండ్లను మగ్గించేందుకు రసాయనాలు వినియోగించే వారిపై చర్యలు తప్పవని విజిలెన్స్ అధికారులు హెచ్చరించారు. బుధవారం రామవరంలోని మామిడి పండ్ల నిల్వ చేసిన రైతుల ఇళ్లల్లో విజిలెన్స్ అధికారులు సింహచలం, పురుషోత్తం తనిఖీలు నిర్వహించారు.

అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రాన్ని పూర్తిచేయండి



నిరసన తెలియజేస్తున్న దళిత సంఘాల నేతలు

విజయనగరం దాసన్నపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఉత్తరాంధ్ర అంబేడ్కర్ రైట్స్ జిల్లా ప్రతినిధి పొంద్రంకి వెంకటరమణ డిమాండ్ చేశారు. భవన నిర్మాణాలు ప్రారంభించాలని కోరుతూ నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్యూల్ కులాల సంఘాల ఒత్తిడి మేరకు గత ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు. అయితే బేస్‌మెంట్‌తో పనులు నిలిచాయన్నారు. తక్షణమే భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో దుర్గా, చెన్నా లక్ష్మి, వీర్రాజు, ఈశ్వరరావు, బంగార్రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు



కొండ సమీపంలో గ్రావెల్ తవ్వకాలు, గ్రావెల్‌తో ట్రాక్టర్

శృంగవరపుకోట రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరనారాయణం- కొండమల్లిపూడి ప్రధాన రహదారిను అనుకుని గ్రావెల్ అక్రమ తవ్వకాలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. రూ.లక్షల విలువైన గ్రావెల్‌ను అక్రమార్కులు తరలిస్తున్నారు. అటుగా అధికారులు కన్నెత్తిచూడటంలేదు. దాంతో వారు మరింత రెచ్చిపోతున్నారు. ఇప్పటికే వీరనారాయణం గ్రామానికి అనుకుని ఉన్న చెరువుల నుంచి మట్టిని తరలించేశారు. ఇప్పుడు గ్రావెల్‌ను తవ్వేస్తున్నారు. ఈవిషయంపై అటవీశాఖ డీఆర్‌వో రవికుమార్ వివరణ కోరగా వారు కొండ ట్రెంచ్ అవతల భాగంలో తవ్వకాలు చేశారన్నారు. సిబ్బందిని పంపి హెచ్చరించి వారిని పంపేశామన్నారు.

పిచ్చి మొక్కలను తొలగించాలి

●బొబ్బిలి మునిసిపల్ కమిషనర్ రామలక్ష్మి



మురుగు కాలువను పరిశీలిస్తున్న రామలక్ష్మి

బొబ్బిలి రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) :కాలువలపై ఉన్న పిచ్చి మొక్కలు, సిల్టు తొలగించాలని, డ్రెయిన్ ఔట్‌లెట్లను క్లియర్ చేయించి నీరు పారేలా చర్యలు తీసుకోవాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బందికి బొబ్బిలి మునిసిపల్ కమిషనర్ రామలక్ష్మి ఆదేశించారు. బుధవారం పట్టణంలోని శివాలయం ఏరియా, పూల్‌బాగ్, వల్లభాయి స్కూల్ రోడ్డు, గ్యాస్ ఏజన్సీ రోడ్డు, విద్వాన్ కాలేజీ ప్రాంతాల్లో రామలక్ష్మి పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడంతో మండిపడ్డారు. వెంటనే గార్బేజ్ పాయింట్లను క్లియర్ చేయించాలని కోరారు.

విద్యార్థులకు నగదు పురస్కారాలు

బొబ్బిలి రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలోని కొప్పులవెలమ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం నియోజకవర్గంలో 2024 - 25 సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన 30 మంది విద్యార్థులకు అభినందించారు.అనంతరం వారికి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు, నగదు పురస్కారాన్ని సంఘం సభ్యులు కలిసి అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు,సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీ వినియోగానికి చర్యలు

బొబ్బిలి రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతయ్యపేటలోగల చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని (ఎస్‌డబ్ల్యూపీసీ) పంచాయతీ అధికారులు వినియోగంలోని తీసుకువచ్చేందుకు చర్యలు ప్రారంభించారు. నిర్వహణ లేకపోవడం, అధికారులు పట్టించుకోకపోవడంపై నిర్వహణలేక....శిథిలావస్థకు చేరి శీర్షికతో ఈనెల 14న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితంకావడంతో పంచాయతీ కార్యదర్శి పార్వతి స్పందించారు. చెత్త నుంచి సేంద్రీయ ఎరువు తయారు చేసేందుకు వీలుగా కుండీలను సిద్ధంచేయించారు. పంచాయతీ నిధులు రాగానే షెడ్‌కు మరమ్మత్తులు చేయిస్తామని సర్పంచ్ బోను రమాదేవి తెలిపారు.

కాలువలో పూడికల తొలగింపు

బొబ్బిలి రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంట గ్రామం పరిసరాల్లోగల పారాది ఆనకట్ట కాలువలో పూడికలను ఉపాధి పథకం కింద బుధవారం తొలగించారు. ఈసందర్భంగా క్షేత్ర సహాయకుడు మురళి మాట్లాడుతూ కాలువలో పూడికలు తీసి ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు వేతనదారులతో పనులు చేయిస్తున్నామని తెలిపారు.

విధుల్లో కొనసాగేలా చర్యలు తీసుకోండి

●తెర్లాం, బొబ్బిలి తహసీల్దార్లకు ఎండీయూ ఆపరేటర్ల వినతి



తెర్లాం: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎండీయూ సిబ్బంది

తెర్లాం, మే 21(ఆంధ్రజ్యోతి): తమను వాహనాల ఆపరేటర్లగా విధుల్లో కొనసాగించకపోతే ఉపాధి కల్పనకు చర్యలు తీసుకోవాలని ఎండీయూ ఆపరేటర్లు కోరారు.ఈ మేరకు బుధవారం తహసీల్దార్ హేమంత్ కుమార్‌కు తమ సమస్యలను పరిష్కరించాలని ఎండీయూ వాహనాల అపరేటర్లు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒప్పందానికి ముందే తొలగించడం అన్యాయమని వాపోయారు. గత ప్రభుత్వం తమకు 2027 వరకు పంపిణీ చేసేందుకు అనుమతిచ్చిందని తెలిపారు. ఇటీవల ప్రభుత్వం తీసుకున్న వాహనాలకు అనుమతులు రద్దుచేయడం వల్ల తమ బతుకులు రోడ్డున పడుతాయని ఆందోళన వ్యక్తంచేశారు.

●బొబ్బిలి రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): తమను విధుల్లో కొన సాగించాలని ఎండీయూ ఆపరేటర్లు కోరారు. జూన్ ఒకటో తేదీ తర్వాత విధుల నుంచి తప్పుకోమనడం అన్యాయమని పేర్కొన్నారు. బొబ్బిలి తహసీల్దార్ ఎం.శ్రీనుకు సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు నాలుగేళ్లగా రేషన్ సరుకులు లబ్ధిదారులకు డోర్ డెలివరీ చేస్తున్నామని, ఇప్పుడు అకస్మాత్తుగా విధుల్లో నుంచి తొలగించడం అన్యాయమని తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలపై దృష్టి సారించాలి

● యూటీఎఫ్ జిల్లా సహా అధ్యక్షుడు ప్రసన్నకుమార్



మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

రామభద్రపురం, మే 21(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టిసారించి న్యాయం చేయాలని యూటీఎఫ్ జిల్లా సహా అధ్యక్షుడు ప్రసన్నకుమార్ కోరారు.ప్రభుత్వ పాఠశాలల్లో రెండు మీడియాలు ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. బుధవారం రామభద్రపురంలో విలేకరులతో మాట్లాడుతూ 45 మంది పిల్లలకు హైస్కూల్‌లో రెండు సెక్షన్లు ఉండాలని, ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం పోస్టు ఎస్‌జీటీలతో నింపాలని డిమాండ్ చేశారు. స్కూల్ అసిస్టెంట్లను హైస్కూల్‌కే పరిమితం చేయాలని, యూపీ స్కూళ్లకు సబ్జెక్టు టీచర్లు ఇవ్వాలని కోరారు. ఫౌండేషన్ పాఠశాలలో 1:30 కాకుండా 1:20 చేయాలన్నారు. ప్రభుత్వం వచ్చి సంవత్సరం గడుస్తున్నా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో చెప్పుకోదగ్గ మార్పులు లేవన్నారు. కార్యక్రమంలో యుటీఎఫ్ నాయకులు శశి, సుధాకర్, కోట శ్రీరాములునాయుడు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు బొబ్బిలిలో ద్విచక్ర వాహన ర్యాలీ

బొబ్బిలి రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి):బొబ్బిలిలో హనుమాన్ దీక్షా సేవా సమితి ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి పురస్కరించుకుని గురువారం సాయంత్రం నాలుగు గంటలకు ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు సేవా సమితిసంఘం సభ్యులు ఒకప్రకటనలో తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో అమరుడైన మురళీనాయక్ కుటుంబానికి శాంతి కలగాలని, ఆంజనేయస్వామి మనోధైర్యాన్ని ఇవ్వాలని పేర్కొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొబ్బిలి రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలో గల 33/11 కేవీ సబ్‌స్టేషన్, బొబ్బిలి కోటి చెరువు వద్ద మెయింటనెన్స్, మరమ్మతులు శుక్రవారం చేయనున్నారు. ఈమేరకు పట్టణంలోని టీటీడీ,ఆర్టీసీ,పోర్ట్ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం తొమ్మిదినుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఈఈ ఆవాల అనంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని నాయుడుకాలనీ, ఆర్టీసీ కాంప్లెక్స్, టీఆర్ కాలనీ, సాయినగర్, స్వామివారి వీధి, హాస్పిటల్ రోడ్డు, వాటర్ ట్యాంకు, వెలమవారి వీధి, చీపురుపల్లి వీధి, పూల్‌బాగ్, మహారాణిపేట, తాండ్రపాపారాయబొమ్మ, వేణుగోపాలస్వామి ఆలయం, మార్కెట్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు తమకు సహకరించాలని కోరారు.

ఉపాధి పథకం బిల్లులు చెల్లించాలి

●రామభద్రపురంలో వేతనదారుల నిరసన



రామభద్రపురంలో నిరసన తెలుపుతున్న ఉపాధి వేతనదారులు

రామభద్రపురం, మే 21(ఆంధ్రజ్యోతి): తక్షణమే ఉపాధి వేతన బిల్లులు చెలించాలని వేతనదారులు కోరారు.ఈ మేరకు బుధవారం రామభద్రపురంలో చొక్కాపువాని చెరువు వద్ద ఆరువారాలుగా వేతనాలు చెల్లించడంలేదని వేతనదారులు నిరసన తెలిపారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు బలసా శ్రీను మాట్లాడుతూ వేతన దారులకు ఆరు వారాల నుంచి బిల్లులు అందకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇప్పటికే తక్కువ వేతనం ఇస్తున్న కేంద్రప్రభుత్వం బిల్లుల చెల్లింపులో కూడా ఆలస్యం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రస్తుతం ఎండతీ వ్రత ఎక్కువగా ఉండడంతో రెండు పూటలా పనులు చేయడంతో వేతన దారులు ఇబ్బందులు పడుతున్నారని, ఒక్కపూటే పనులు చేయించాలని కోరారు.కొంతకాలంగా ఉపాధి పనులు చేస్తున్నవారికి ఎటువంటి సౌకర్యాలు కల్పించడం లేదని, ఎండలో పనులు చేయడం వల్ల చాలా మంది అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. పని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు, మజ్జిగ సౌకర్యం కల్పించాలని కోరారు. ఎటువంటి అంక్షలు లేకుండా ప్రతి ఉపాధిహామీ కూలీకి రూ.307ల కనీస వేతనం ఇవ్వాలని, కుటుంబ సభ్యులకు జాబ్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



మహానాడు వేదిక వద్ద సందడి చేస్తున్న కళావెంకటరావు,పార్టీ శ్రేణులు

టీడీపీని బలోపేతం చేయండి

(ఐదో పేజీ తరువాయి)

వినియోగించడం వల్లే ప్రస్తుతం విజయనగరానికి ఉగ్ర లింకుల మరక అంటిందన్నారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకటరావు మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చిన హామీల్లో(సూపర్ సిక్స్)లో తొలి ఏడాదే ఐదు ప్రజల ముంగిటకు చేరాయని, ఈ విషయాన్ని ప్రజలకు వివరించడం మరిచిపోతే, చైతన్యం తేకపోతే ఇబ్బందికర పరిస్థితి ఏర్పడుతుందన్నారు. చేసింది చెప్పాలన్నారు. శాసనసభ మాజీ స్పీకర్, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు కావలి ప్రతిభాభారతి మాట్లాడుతూ, దేశంలో ఏ పార్టీకి లేని విధంగా టీడీపీకి కార్యకర్తలు ఉన్నారన్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఏడాదిలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా ప్రభుత్వం ముందుకు వెళ్తున్నదన్నారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో మహానాడు సభలు పూర్తయ్యాయని, రాష్ట్రస్థాయి మహానాడును కూడా విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ, పార్టీలో సామాన్య కార్యకర్తకు సైతం గుర్తింపు ఉంటుందని చెప్పేందుకు తనకు లభించిన ఎంపీ పదవే నిదర్శనమన్నారు. సభకు అధ్యక్షత వహించిన కిమిడి నాగార్జున మాట్లాడుతూ, టీడీపీ నాయకులు కార్యకర్తల త్యాగాలు మరువలేనివని, వైసీపీ అరాచక పాలనను అంతమొందించేందుకు పార్టీ శ్రేణులు ఎంతో శ్రమించాయన్నారు. పార్టీ విజయనగరం జిల్లా పరిశీలకుడు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ, పార్టీ సంస్థాగత నిర్మాణం తొలి దశ ఇప్పటికే పూర్తయిందని, మహానాడులోగా మిగతా సంస్థాగత ఎన్నికల ప్రక్రియ దశలవారీగా ప్రారంభం కానుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అదితిగజపతిరాజు, బేబీనాయన, కోండ్రు మురళీమోహన్, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ, మాజీ మంత్రి సుజయ్ కృష్ణరంగారావు, టీడీపీ నాయకుడు మహంతి చిన్నంనాయుడు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు తదితరులు పాల్గొన్నారు.



మహానాడుకు హాజరైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

విజయనగరంలోనే పేలుళ్లకు స్కెచ్

(ఐదో పేజీ తరువాయి)

వచ్చినట్టు విచారణ అధికారులు గుర్తించారు. నిందితుడి వద్ద స్వాధీనం చేసుకున్న రెండు సెల్‌ఫోన్లలో కీలక ఆధారాలు లభించాయి. సిరాజ్‌తోనే పాస్‌వర్డ్ చెప్పించి లాక్ తీయించారు. వాటిలో వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ట్విట్టర్, సిగ్నల్, టెలిగ్రామ్ వంటి అన్నిరకాల సమాచార యాప్‌లు ఉండడంతో అధికారులు విస్తుపోయారు. అందులో సిరాజ్, సమీర్ మధ్య పేలుడు పదార్థాల సేకరణ, వినియోగంపై ఉత్తరప్రత్యుత్తరాలు కొనసాగాయి. వీరి మధ్య గంటల తరబడి చాటింగ్ సాగినట్టు సైతం గుర్తించారు.

కొత్తగా అదుపులోకి ముగ్గురు..

విజయనగరంలో ఇద్దరు వ్యాపారులను పోలీసులు తాజాగా అదుపులోకి తీసుకున్నారు. ఉగ్ర సానుభూతిపరులు ఇచ్చిన సమాచారంతోనే వారిని అదుపులోకి తీసుకున్నట్టు ప్రచారం సాగుతోంది. కన్యకాపరమేశ్వరి కోవెల ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యాపారులతో పాటు మరోవ్యక్తిని రెండో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరు నిందితులకు పేలుడు పదార్థాలను విక్రయించారని అనుమానిస్తున్నారు. ఇంకోవైపు సిరాజ్, సమీర్‌లను కస్టడీకి ఇవ్వాలని విజయగనగరం రెండో పట్టణ పోలీసులు ఇప్పటికే పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కోర్టు వాదనలు విన్నాక తీర్పును రిజర్వ్ చేసింది. మరోవైపు జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు బృందాలుగా విడిపోయి నగరం మొత్తాన్ని జల్లెడ పడుతున్నారు. దాదాపు 10 మంది అధికారులు విచారణ సాగిస్తున్నారు.

బ్యాంక్‌లో అకౌంట్లపై ఆరా..

సిరాజ్‌తో పాటు కుటుంబసభ్యుల ఆర్థిక పరిస్థితిపై దర్యాప్తు అధికారులు ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. సిరాజ్‌తో పాటు కుటుంబసభ్యుల బ్యాంక్ అకౌంట్ల వివరాలు అందించాలని నగరంలో అన్ని బ్యాంకుల అధికారులకు సమాచారమిచ్చారు. మరోవైపు సిరాజ్‌తో పాటు కుటుంబ సభ్యులందరికీ డీసీసీబీ బ్యాంకులో అకౌంట్‌తో పాటు మరికొన్ని బ్యాంకుల్లో ఖాతాలు ఉన్నాయని తెలిసింది. సిరాజ్ తండ్రి ఇంతకుముందు కొత్తవలస పోలీస్ స్టేషన్‌లో పనిచేసేవారు. ఆ సమయంలోనే కొత్తవలస డీసీసీబీ బ్రాంచిలో అకౌంట్లు తెరిచినట్టు తెలుస్తోంది. సిరాజ్‌తో పాటు అతడి తండ్రికి అక్కడే బ్యాంక్ అకౌంట్ ఉండేది. అయితే తండ్రి బదిలీ జరిగిన తరువాత సిరాజ్ తన అకౌంట్‌ను కూడా విజయనగరం డీసీసీబీకి బదిలీ చేసుకున్నాడు. సిరాజ్ తండ్రి బ్యాంక్ లాకర్‌ను తెరిచేందుకు ప్రయత్నించారని సమాచారం. లాకర్‌ను తెరిచేందుకు మొదట యూనిఫారం లేకుండా వెళ్లారు. బ్యాంక్ అధికారులు నిరాకరించారు. అయితే అప్పటికే దర్యాప్తు అధికారుల ఆదేశాలు ఉండడంతో బ్యాంక్ అధికారులు లాకర్ తెరిచేందుకు అంగీకరించలేదు.



విజయనగరం పట్టణం

● సిరాజ్ తండ్రి సోమ, మంగళవారాల్లో వరుసగా రెండుసార్లు బ్యాంకుకు వచ్చి లాకర్ తెరవాలని కోరినట్టు సమాచారం. జాతీయ దర్యాప్తు సంస్థ లోతైన విచారణ చేపడుతుండడంతో మరిన్ని నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే సిరాజ్, కుటుంబ సభ్యుల ఖాతాలను దర్యాప్తు సంస్థ, పోలీసులు సీజ్ చేశారని తెలిసింది.

'కర్మయోగి'పై అవగాహన అవసరం

సీతానగరం, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన కర్మయోగి పోర్టల్ కోర్సుపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన అవసరమని డీఎల్‌పీవో నాగ భూషణరావు తెలిపారు. బుధవారం సీతానగరం మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎంఎల్‌ఎన్ ప్రసాద్ అధ్యక్షతన పంచాయతీకార్యదర్శులతో డిప్యూటీ ఎంపీడీవో కె.కుమార్‌వర్మతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్మయోగి పోర్టల్‌ను లాగిన్‌అయి సాంకేతిక కోర్సులను పూర్తి చేయాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమం జూన్ 21న నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడాకారుల నియామకానికి పంచాయతీ స్థాయిలో కమిటీలను వేయాలని, యోగా భ్యాసానికి అవసరమైన టీచర్‌ను నియమించుకోవాలని సూచించారు. స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో ఇంటి పన్నుల్లో ఉన్న తేడాలను గుర్తించి పూర్తిపై చేయాలని, ప్రతి ఇంటి యజమాని ఆధార్ నెంబరును సేకరించి అప్‌డేట్ చేయాలని సూచించారు. ఇంటి పన్నులు వసూళ్లు చేయాలని కోరారు.

1655 నాడెప్ యూనిట్ల మంజూరు

●ఉపాధి హామీ సహాయ సంచాలకుడు శ్రీహరిరావు

గరుగుబిల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): ఐదు మండలాలకు సంబంధించి 1,655 నాడెప్ యూనిట్లు మంజూరయ్యా యని సీతంపేట క్లస్టర్ ఉపాధి హామీ సహాయ సంచాలకులు గుంట్రెడ్డి శ్రీహరిరావు తెలిపారు. బుధవారం మండలంలోని ఉల్లిభద్ర, కొంకడివరంల్లో ఉపాధి పనులను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సీతంపేట క్లస్టర్ పరిధిలోని వీరఘట్టాం, సీతంపేట, గరుగుబిల్లి, భామిని, పాలకొండ మండలాలకు సంబంధించి ఎరువులు, గుంతలకు సంబంధించి నాడెప్ యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఉపాధి హామీపథకంలో మంజూరైన మేరకు అభివృద్ధి పనులను నిర్దేశించిన సమయానికి పూర్తిచేయాలని సూచించారు. గ్రామాల్లో వ్యర్థాలను ఆరుబయట వేయకుండా గృహాలకు ఆనుకుని ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామన్నారు. సమావేశంలో ఏపీవో ఎం.గౌరీనాథ్, ఈసీ జి.అవినాష్, ఎం.శ్రీహరిరావు పాల్గొన్నారు.

సీసీఆర్‌సీ కార్డులు సిద్ధం చేయండి

సీతానగరం, మే 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కౌలు రైతులందరికీ సీసీఆర్‌సీ గుర్తింపు కార్డులు పంపిణీ చేయడానికి సిద్ధం చేయాలని ఇన్‌చార్జి తహసీల్దార్ ఎ.ఉమామహేశ్వరరావు కోరారు. బుధవారం సీతానగరం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌వోలు, రెవెన్యూ సిబ్బందితో వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీఆర్వోలు గ్రామాల్లో అమలవుతున్న రీసర్వే, రైస్‌కార్డుల పరిశీలించాలని, అన్నదాత సుఖీభవ, గ్రీవెన్స్ పిటిషన్లు పరిష్కరించాలని, ఇళ్ల స్థలాల వెరిఫికేషన్, సీసీఆర్‌సీ ధ్రువపత్రాల అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే వివరాలు, రైతుల భూములకు సంబంధించిన నక్షలను సరిచూసుకుని అసలైన రైతులకు న్యాయం చేయాలన్నారు. ఇప్పటివరకు ఇళ్ల స్థలాలు లేని పేదలందరికీ పట్టాలు మంజూరు చేయడానికి వచ్చిన దరఖాస్తులు వెరిఫికేషన్ చేయాలని సూచించారు. అర్హులైన వారందరికీ స్థలాలు సమకూర్చాలని ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసిందన్నారు. భూమి శిస్తు సకాలంలో రైతుల నుంచి వసూలు చేయడానికి సమాయత్తం కావాలని కోరారు.

జంఝావతి సాధన సమితి ఎన్నిక

బెలగాం, మే 21 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా రైతులను ఊరిస్తున్న జంఝావతి ప్రాజెక్టు పూర్తి చేసి ఆయకట్టుకు సాగునీరు అందించాలని జంఝావతి సాధన సమితి డిమాండ్ చేసింది. బుధవారం పార్వతీపురంలో ఏపీ ఎన్జీవో హోంలో ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మరిశర్ల కృష్ణమూర్తి నాయుడు ఆధ్వర్యంలో జంఝావతి సాధన సమితిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా డి.పారినాయుడు, అధ్యక్షులుగా చుక్క భాస్కరరావు, ప్రధాన కార్యదర్శిగా పల్లి రాజగోపాల నాయుడు, ఉపాధ్యక్షులుగా ఈర్ల సంజీవ నాయుడు, కొల్లి సంహాచలం, వర్కింగ్ ప్రెసెడెంట్‌లుగా మంచుపల్లి శ్రీరాములు, సవరపు రామారావు, రంజిత్ కుమార్, ఈవి నాయుడు, కార్యదర్శులను, ప్రచార కమిటీ కన్వీనర్లను ఎన్నుకున్నారు. జంఝావతి ప్రాజెక్టు పూర్తి చేసి రైతులకు సాగు నీరిందించే వరకు పోరాడతామని సాధన కమిటీ స్పష్టంచేసింది.

సాగర్ పనులు పునఃప్రారంభిస్తాం :డీఈఈ

పార్వతీపురం, మే 21(ఆంధ్రజ్యోతి): వెంగళరాయసాగర్ జలాశయం ఆధునికీకరణ పనులను జైకా నిధులు రూ.63.50 కోట్లతో నాలుగేళ్ల కిందట ప్రారంభించామని మామిడిపల్లి వీఆర్‌సీహెచ్‌డబ్ల్యూ ఉప విభాగం ఉపకార్యనిర్వాహక ఇంజనీర్ డి.సురేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలి పారు.ఈనెల 19న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన ఆధునికీకరణ లేకపోయే కథనానికి ఆయన బుధవారం స్పందించారు. వెంగళరాయ సాగరం ఆధునికీకరణ పనులను పునః ప్రారంభిస్తామని చెప్పారు. వెంగళ రాయ సాగర్ ప్రాజెక్టు పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం విపత్తులశాఖ నిధులు రూ.73.9 లక్షలతో 19 పనులు ప్రారంభించినట్లు తెలిపారు.చేపట్టిన పనుల్లో 11 పనులు పూర్తిచేశామని, రెండుపనులు పురోగతిలో ఉన్నాయని, మిగిలిన ఆరు పనులు పారంభించాలని కాంట్రాక్టర్‌కు నోటీసులు పం పించినట్లు పేర్కొన్నారు.

ఎండీయూ వాహనాల రద్దు సరికాదు

పాలకొండ, మే 21 (ఆంధ్రజ్యోతి): ఎండీయూ వాహనాలు రద్దు చేయాని ప్రభుత్వం నిర్ణయించడం సరికాదని, ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని మన్యం జిల్లా ఎండీయూ ఆపరేటర్లు అసోసియేషన్ అధ్యక్షుడు మన్మథరావు పేర్కొన్నారు. బుధవారం పాలకొండ ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎండీయూ ఆపరేటర్లతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో 18,500 కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. రెండుసంవత్సరాల నాలుగు మాసా లుగా అంగన్‌వాడీ, మిడ్‌డే మీల్స్ బకాయిలు వెంటనే విడుదల చేయాల న్నారు. ఇన్సూరెన్స్ మొత్తం రూ.తొమ్మిది వేలు వ్యక్తిగత ఖాతాలకు కట్ చేశారని, వెంటనే ఆ మొత్తాన్ని జమ చేయాలని కోరారు.

మక్కువలో ఈదురుగాలులతో వర్షం

మక్కువ, మే 21 (ఆంధ్రజ్యోతి): మక్కువ తదితర గ్రామాల్లో బుధవారం ఈదురుగాలులతోకూడిన భారీ వర్షంకురిసింది.మధ్యాహ్నం ఎండ తీవ్రతతో ఇబ్బంది పడిన ప్రజలు సాయంత్రం కురిసిన వర్షం వల్ల ఉపశమనం పొందారు. ఈదురుగాలుల వల్ల కొన్ని చోట్ల వృక్షాలు నేలకొరిగాయి. మక్కువ ప్రధాన రహదారి జంక్షన్ సమీపంలో ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో రోడ్డుపై మురుగునీరు ప్రవహించడంతో ప్రయాణికులు, వాహన చోదకులు, పాదచారులు అవస్థలు పడ్డారు.

నేడు మినీ మహానాడు

పార్వతీపురం, మే 21 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో గురువారం అరకు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ మినీ మహానాడు జరగనుంది. కార్యక్ర మానికి మంత్రి గుమ్మడి సంధ్యారాణి, అరకు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు కె.శ్రావణ్‌కుమార్, పార్లమెంట్ పరిధిలో ఉన్న వివిధ నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు,నాయకులు, హాజరుకానున్నట్టు ఎమ్మెల్యే బోనెల విజయచం ద్ర తెలిపారు.

నేడు హనుమాన్ జయంతి

గరుగుబిల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి వేంకటేశ్వరస్వామి దేవ స్థానం ఆవరణలో నిర్మించిన హనుమాన్ ఆలయంలో గురువారం హను మాన్ జయంతిని నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో వీవీ సూర్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకాలు, సింధూర, కుంకుమార్చనలతోపాటు పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

28న ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా

పాలకొండ, మే 21 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ఎడమ కాలువల భూముల కు నీరు విడుదల చేయడంతోపాటు పలు సమస్యలు పరిష్కరించాలని ఈనెల 28న ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బంటు దాసు పేర్కొన్నారు. ఈ మేరకు మండలంలోని భాసూరులో ధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

టీచర్ల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

(ఐదో పేజీ తరువాయి)



మళ్లీ పెళ్లి చేసుకోని మహిళా టీచర్లు, సైనిక విభాగాల్లో పనిచేసి టీచర్లుగా ఉన్నవారికి ఐదు పాయింట్లు

● స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను రెండేళ్లుగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు ఐదు పాయింట్లు

● పునర్విభజనలో తప్పనిసరిగా బదిలీ అయిన ఉపాధ్యాయులకు ఐదు పాయింట్లు

ప్రాధాన్యత ఇలా..

● వందశాతం దృష్టిలోపం లేదా 80 శాతం శారీరక వైకల్యం ఉన్నవారికి మొదటి ప్రాధాన్యం

● 75 శాతం దృష్టిలోపం, 70 - 79 శాతం మధ్య శారీరక వైకల్యం లేదా 70 శాతానికి పైగా వినికిడిలోపం ఉన్నవారికి రెండో ప్రాధాన్యం

● పునర్వివాహం చేసుకోని వితంతువులు, క్యాన్సర్, ఓపెన్‌హార్ట్ సర్జరీ, బోన్‌టీబీ, కిడ్నీ మార్పిడి, డయాలసిస్, స్పైనల్ సర్జరీ చేసుకున్నవారు, జీవిత భాగస్వామి లేదా పిల్లలు జువనైల్ డయాబెటిస్, తలసేమియా, హీమోఫీలియా, కండరాల క్షీణతతో బాధపడుతున్న వారికి సైతం ప్రాధాన్యం ఇస్తున్నారు.